క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని లింగన్వాయిలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు డాక్టర్ అజయ్ ఆదివారం సమ్మేళన సమావేశ స్థలాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించామన్నారు. ఆత్మీయ సమ్మేళన సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీచుపల్లి, నర్సన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

మల్దకల్: గ్రామ పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సర్పంచ్ పద్మమ్మ సూచించారు. ఆదివారం అమరవాయి, బూడిదపాడు గ్రామాల్లోని వివిధ కాలనీలను ఆమె సందర్శించి కాలనీవాసులతో మాట్లాడారు. ఇళ్ల ముందు మురుగు నిల్వ ఉడకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చెత్తాచెదారాన్ని పంచాయతీ ట్రాక్టరులో వేసి పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సరోజ, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



గట్టు: మండల పరిధిలోని మాచర్లలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి అయిజ కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయిజ కమిటీ సభ్యులు మాట్లాడారు. త్రైతసిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలోని కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైతసిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. అనంతరం త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాచర్ల సర్పంచ్ సిద్ధిరామప్ప, ప్రబోధాసేవా సమితి అయిజ కమిటీ అధ్యక్షుడు చిన్న వీరేష్, సభ్యులు బస్సు నర్సింహులు, సూరి, భాస్కర్, నరేష్, దేవేంద్ర, విజయ్, అక్షయ, కళావతి, లక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



శాంతినగర్: టీడీపీలో సభ్యత్వం చేసుకుని తెలంగాణ అభివృద్ధికి పాటుపడాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గజేంద్రగౌడ్ అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమొర్సులో మండల మాజీ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ గతంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సుబ్బారావు, రామాంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరులో వేణుగోపాలస్వామి జాతర సందర్భంగా ఆదివారం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ యువజన నాయకుడు ఆర్.కిశోర్ హాజరై బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో క్రీడలను నిర్వహించడంతో యువత కలిసిమెలిసి ఉండటంతో పాటు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం ఈస్టర్ సందర్భంగా గ్రామంలోని చర్చిలో క్రైస్తవులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, రాముడు, మహేష్, ఎర్రన్న, శ్రీను, ప్రభాకర్, బాబన్న, రత్నన్న, నాగన్న తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో వసతులు కరువు

- ఆస్పత్రిలో మందుల కొరత
- కూర్చునేందుకు స్థలం లేక అవస్థలు
- నిలబడి వైద్యం చేయించుకునే పరిస్థితి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



రోగిని బెంచిపై పడుకోబెట్టి వైద్యం చేస్తున్న సిబ్బంది

అయిజ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు లేకపోవడంతో అటు ప్రజలు, ఇటు పీహెచ్‌సీ సిబ్బంది అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రికి సరిపడా మందులు సకాలంలో అందడంలేదు. కూర్చోవడానికి కుర్చీలున్నా సరే వాటిని వేసేందుకు ఆస్పత్రి భవనంలో స్థలం చాలడంలేదు. కనీసం చెట్ల కింద కూర్చుందామనుకుంటే ఆస్పత్రి ఆవరణలో చెట్లు లేవు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య పట్టి పీడిస్తుంది.

రోగుల సంఖ్య ఎక్కువ..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థానికులే గాక పొరుగు మండలాల నుంచి కూడా ప్రజలు వస్తున్నారు. వైద్యులు తగినంత మంది సిబ్బంది ఉన్నాగాని ఆస్పత్రిలో మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ప్రతి రోజు సుమారు 180 మంది అవుట్ పేషెంట్లు, 15 మంది ఇన్ పేషెంట్లు వస్తుంటారు. వారిలో గర్భిణులు సుమారు 60 మంది ఉంటున్నారు. రోజుకు రోగుల సంఖ్య ఘననీయంగా పెరుగుతున్నా.. సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉండటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎక్కువ సంఖ్యలో కాన్పులు నిర్వహిస్తుండటంతో 2015–16 సంవత్సరం నుంచి 2021–22 సంవత్సరం వరకు వరుసగా రాష్ట్రంలోనే అయిజ పీహెచ్‌సీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఆస్పత్రిలో కేవలం 6 పడుకలు మాత్రమే ఉన్నాయి. రోగులు కూర్చోవడానికి కావాల్సినన్ని కుర్చీలు ఉన్నాసరే.. వాటిని వేసేందుకు పీహెచ్‌సీ భవనంలో స్థలం చాలడంలేదు. ఆస్పత్రిలో రోగులకు సరిపడా మందులు సకాలంలో రావడంలేదు. ఇప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి మందులు సరఫరా అవుతున్నాయి. నాలుగు నెలలకు ఒకసారి ఇండెంట్ పెడితే అవి చాలడంలేదు. దాంతో రోగులు మందులను బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పీహెచ్‌సీకి ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కూర్చోవడానికి స్థలం లేదు..



ఏదైనా రోగం వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే.. అక్కడ కుర్చీలు వేసుకుని కూర్చోడానికి స్థలం చాలడంలేదు. క్యూలో నిలబడి డాక్టర్ వద్దకు వెళ్తే.. అక్కడ పేషెంట్‌కు మాత్రమే కూర్చునేందుకు ఒక స్టూల్ మాత్రమే ఉంటుంది. వరండాలో నిలబడి వైద్యం చేయించుకోవాల్సి వస్తుంది. నిలబడలేని వాళ్లు నేలపై కూర్చుంటున్నారు.

– సుశీలమ్మ, అయిజ

మందులు లేవు..



ఆస్పత్రిలో రోగులకు సరిపడినన్ని మందులు రావడం లేదు. కొన్ని మందులను బయట మెడికల్ షాపుల్లో కొనుక్కోవాల్సి వస్తుంది. రోగులకు సరిపడా మందులను తెప్పించి ఇస్తే బాగుంటుంది. ఆస్పత్రిలో తాగునీటి సౌకర్యం కల్పించడం లేదు. డాక్టర్లు, సిబ్బంది, రోగులు కూడా ఇంటి నుంచి సీసాలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు.

– వెంకటమ్మ, అయిజ

ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నా..



పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అందుకు సరిపడా మందులు రావడం లేదు. నాలుగు నెలలకు ఒకసారి ఇండెంట్ పెట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అన్ని పీహెచ్‌సీలకు మందులు ఇవ్వాల్సి రావడంతో మందుల కొరత ఎక్కువగా ఉంది. సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం.

– అమృతరాజు, ఫార్మాసిస్టు

పాతపెన్షన్ విధానం సాధించుకుందాం



అలంపూర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు

అలంపూర్: ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానం సాధించుకోవడానికి కలిసి రావాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పెన్షన్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఓపీఎస్ కోసం ఆరు నెలల కార్యాచరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. పాత పెన్షన్ విధానం సాధించుకోవడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు ప్రతాప్ రెడ్డి, నవీన్ కుమార్, క్రిష్ణ, సతీష్ కుమార్, రామక్రిష్ణారెడ్డి, శ్యాంబాబు, యోగి, హరిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమావేశం

గద్వాల అర్బన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందని తెలంగాణ పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇక్బాల్ పాష ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ కాలనీలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సమావేశం అనంతరం సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసి వినతి అందజేయనున్నట్లు తెలియజేశారు.

మలుపులు ప్రమాదాలకు పిలుపులు



కుర్తిరావులచెర్వు మల్దకల్ గ్రామాల మధ్య



పెద్దొడ్డి మల్దకల్ గ్రామాల మధ్య మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద నిర్మాణ సమయంలో అధికారులు ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్ నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావులచెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు




ధరూరులో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ధరూరు: మండలంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు పునరుత్థాన దినంగా జరుపుకొనే ఈ పండుగను ఆయా గ్రామాల్లోని చర్చీల్లో తెల్లవారుజామున చర్చీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పునరుత్థానాన్ని గుర్తుచేసుకుంటూ కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు విజయ పథాక జెండా ఎగురవేశారు. ధరూరు ఎంబీ షాలేం చర్చి, మరనాథ విశ్వాస సమాజం, హోసన్నా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పునరుత్థాన సందేశాన్ని బైబిల్ ఆధారంగా పాస్టర్లు నరేష్‌పాల్, అబ్రహం, కృపరాజ్, ప్రభాకర్ క్రైస్తవులకు వివరించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. దీంతో పాటు మండల పరిధిలోని నెట్టెంపాడు, అల్వలపాడు, మార్లబీడు, ర్యాలంపాడు, మన్నాపురం, సోంపురం, రేవులపల్లి, చింతరేవుల, చిన్నపాడు, చింతరేవుల, గార్లపాడు, తదితర గ్రామాల్లోని చర్చీల్లో ప్రార్థనలు నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల చర్చిలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక ప్రార్థనలు చేశారు. భక్తులకు ఆయా గ్రామాల చర్చిలో సందేశం ఇచ్చారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఎర్రవల్లి, ఇటిక్యాల, షాబాద్, వేముల, కొండేరు, ఉదండాపురం, పెద్దదిన్నె, వల్లూరు తదితర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక సందేశ కార్యక్రమాలు నిర్వహించారు.



ధరూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఇటిక్యాలలో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అయిజ: డీసీఎం, ఆటో ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు గాయాలపాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దేవబండకు చెందిన రామాంజనేయులు శనివారం రాత్రి ఆయన అక్కను కలిసేందుకు స్వగ్రామం నుంచి బింగుదొడ్డికి ఆటోలో బయలుదేరాడు. గద్వాల నుంచి ఎదురుగా వస్తున్న డీసీఎం ఆటోను ఢీకొనడంతో ఆటో నడుపుతున్న రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూల్ జిల్లా ఆస్పరకు చెందిన డీసీఎం డ్రైవర్ సత్తిబాబు వెంటనే పరారయ్యాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గాయపడిన రామాంజనేయులుని గమనించి వెంటనే పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రామాంజనేయులు తండ్రి కుర్వ ఎల్లప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం

అలంపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని టూరిజం హోటల్‌లో బీజేపీ బూత్ స్వశక్తి అభ్యాస్ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ బూత్ స్వశక్తి అభ్యాస్ కేంద్రాల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 592 బూత్ స్వశక్తి అభ్యాస్ కేంద్రాలు పూర్తి చేసినట్లు చెప్పారు. 172 శక్తి కేంద్రాలు సైతం పూర్తి చేసినట్లు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు అందరూ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషనల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బంగారు లక్ష్మణ్, సత్యారెడ్డి, నాగమద్దిలేటి, నరేష్, సురేష్, సూరిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిన సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి సీపీఎం నాయకులు పెద్దఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడారు. రాష్ట్రంలో రానున్న కాలంలో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా, లౌకిక శక్తులకు ఏకీకరణ లక్ష్యంగా సీపీఎం, సీపీఐలు రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం పోరాటాలు చేస్తాయన్నారు. రాజు, మద్దిలేటి, పరంజ్యోతి, నర్సింహ, ఈదన్న, రాములు ఉన్నారు.



గేటు మరమ్మతు చేపట్టండి

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన గేటుకు మరమ్మతు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఈ గేటు ఇప్పటికే సగభాగం శిథిలావస్థకు చేరుకుంది. గేటుకు మరమ్మతు చేయాలని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని మల్దకల్ గ్రామస్తులు వాపోతున్నారు. అదే విధంగా ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో పాటు ఉన్న ప్రహరీ కూడా అక్కడక్కడ కూలిపోవడంతో ఆరోగ్యకేంద్రం ఆవరణలోకి పశువులు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా మారుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గేటుకు మరమ్మతు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన గేటు

పాఠశాలలో మరుగుదొడ్లు అస్తవ్యస్తం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలురలకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించిన వాటిని గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి అస్తవ్యస్తం చేశారు. పదో తరగతి కేంద్రం ఉన్న విద్యార్థులకు ఎలాంటి మూత్రశాలలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు లేకపోవడమే కాదు.. కనీసం మూత్రశాలలు లేక పరీక్ష పూర్తయ్యేవరకు వేచి ఉండే పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మరుగుదొడ్లోనే అందరూ వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలను నిర్మించాలని కోరుతున్నారు.



ఉండవెల్లిలోని జెడ్పీ పాఠశాలలో మూత్రశాలలు

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరులో వెలిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా 10న స్వామివారి కల్యాణం, 11న ప్రభోత్సవం, 12న రథోత్సవం, 13న పారువేట, 14న జలక్రీడలతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 13న వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అవినీతికి చెక్

- పని చేసేచోట నుంచి కూలీల ఫొటోలు

కేటీదొడ్డి: ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా కూలీల హాజరును పక్కాగా అమలు చేస్తున్నారు. గతంలో కొందరు కూలీలు పనులకు హాజరుకాకపోయినా పనులకు వచ్చినట్లు హాజరు చేసేవారు. సామాజిక తనిఖీల్లో ఇలాంటి లోటుపాట్లను గుర్తించిన అధికారులు జనవరి నుంచి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్) యాప్ ద్వారా హాజరు తీసుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గతంలో లేకపోవడంతో ఆ విధానాన్ని అమలు చేయడం అధికారులకు కష్టంగా ఉండేది. ప్రభుత్వం తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవడం, యాప్ హాజరుశాతాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడినట్టైంది. గతంలో వర్క్ ఐడీ కింద 20 మందికి మించితే ఆ గ్రూప్ ఫొటో నమోదు చేయాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం ఒక వర్క్ ఐడీ కింద కూలి పని చేస్తున్న వారి ఫొటోలను విడివిడిగా తీసి యాప ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫొటో తీసుకున్న తర్వాత ఇంటికి వెళ్తారనే ఉద్దేశంతో మొదట తీసిన ఫొటో తర్వాత నాలుగు గంటల విరామం ఇచ్చి తర్వాత రెండోసారి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు నెలకు 30 జీబీ కల్గిన సిమ్‌కార్డులు ఇచ్చారు. మండలంలోని 11,466 వేల జాబు కార్డులు ఉండగా.. 25,356 కూలీల పేర్లు నమోదు చేసుకున్నారు.



అక్రమాలకు తావులేదు..

కూలీల హాజరు నమోదు వివరాలు తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయిస్తున్నాం. దీంతో అక్రమాల చోటుకు తావులేదు. యాప్ గతేడాది నుంచే అమలులోకి వచ్చినా అప్పట్లో ఫీల్డ్‌అసిస్టెంట్లు లేక సరిగా అమలు చేయలేకపోయాం. వారిని ప్రభుత్వం విధుల్లోకి తీసుకున్నందున యాప్ వినియోగాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

– మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంపీడీఓ, కేటీదొడ్డి

సమస్యలు ఉన్నాయి..

యాప్ వినియోగంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. పని జరిగే చోట తీయాల్సి వస్తోంది. గ్రామంలో వివిధ చోట్ల పనులు చేస్తున్నప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేయడం ఇబ్బందిగా ఉంది. అయితే యాప్ వినియోగంతో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి.

– మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్, కుచినెర్ల

చలివేంద్రం ఏర్పాటు

మానవపాడు: మండలంలోని గోకులపాడుకి చెందిన సధాకర్ గోకులపాడులో గోకారమయ్య, దస్తగిరయ్య పేరుపై స్టేజి సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశాడు. ప్రతి రోజు నీటిని కుండలో నింపి అందరికి అందుబాటులో ఉంచుతున్నాడు. మానవపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీగనర్, బొంకూరు, శాంతినగర్, కలుకుంట్ల తదితర గ్రామాలకు ప్రజలు నిత్యం ఈ రోడ్డు వెంట ప్రయాణం సాగిస్తుంటారు. ప్రయాణికులు, వాహనదారులు దాహం తీర్చుకుని హర్షం వ్యక్తం చేశారు.